ఇంటికి వచ్చాడు. అతను రాబోయే ముందు ఇల్లు సర్దిన ఆమెకి కొన్ని నెలల క్రితం తను కొన్న ఆ కొత్త రచయిత పుస్తకం కనిపించింది.

"చూసావా శ్రీనివాస్! ఈ నవలా రచయిత పేరు కూడా నీ పేరే. తమాషాగా లేదు?" అతనొచ్చాక దాన్ని చూపించి చెప్పిందతనితో.

"లేదు. ఎందుకంటే ఆ పుస్తకాన్ని రాసింది నేనే." చెప్పాడు శ్రీనివాస్.

అతనెళ్ళాక ఆ రాత్రి ఆ యువతి ఆ నవలని తిరిగి చదవడం ప్రారంభించింది. ఈ సారి ఆ నవల ఆమెకి విసుగు అనిపించకపోగా బాగా నచ్చింది. శ్రీనివాస్ ఆమె అభిమాన రచయిత అయ్యాడు.

కారణం?

ఆ నవలా రచయితతో ఆమె ప్రేమలో పడింది. ఇదే విధంగా నిన్న భగవద్గీతని చదివి అది విసుగు అనిపించినవారు దాని రచయితతో ప్రేమలో పడితే నేడు అది వారికి ఎంతో నచ్చుతుంది.

## 99. చొక్కా

ఓ ఊళ్ళోని ఓ ఐశ్వర్యవంతుడి దగ్గర అతని జీవిత కాలంలో అతను ఖర్చు చేయలేనంత డబ్బుంది. అతని జిల్లాలో అతనికి ఉన్నంత భూమి మరెవరికీ లేదు. అతని సేవకులు అతని మాటని వింటారు. అతని కుటుంబ సభ్యులు అతన్ని ప్రేమిస్తారు. ఐనా ఆరోగ్యంగా ఉన్నా తనకి ఆనందం లేదని గుర్తించాడతను.

తన ఊరికి వచ్చిన ఓ ఆధ్యాత్మిక గురువు దగ్గరకి వెళ్ళి అడిగాడు.

"సరైన ఆనందం పొందడం ఎలా స్వామి?"

ఆయన చిన్నగా నవ్వి బదులు చెప్పాడు.

"మీ జిల్లాలో బాగా అనందంగా ఉన్న వ్యక్తి చొక్కాని నువ్వు ఓ రోజు ధరిస్తే నీకు అసలైన ఆనందం కలుగుతుంది."

అలాంటి వ్యక్తి ఒకతను తమ పొరుగూరులో ఉన్నాడని తెలుసుకుని అతని చిరునామాని పట్టుకుని అతని దగ్గరకి వెళ్ళాడు. చూడగానే అతని మొహంలో పరమ శాంతి కనిపించింది.

"మీరు బాగా ఆనందంగా ఉంటారని విన్నాను. నిజమేనా?" ప్రశ్నించాడు ఆ ధనవంతుడు.

"అనే అనుకుంటున్నారంతా." నవ్వాడు అతను.

"మీ చొక్కాని ఓ సారి ఇస్తే దాన్ని తొడుక్కుని ఇచ్చేస్తాను." కోరాడు ధనవంతుడు.

"నా అన్నదే నాకు లేనప్పుడు ఇంక చొక్కా ఎక్కడనించి వస్తుంది?" గోచీలో ఉన్న అతను నవ్వుతూ ప్రశ్నించాడు.

## 100. స్వీయ బోధ

ఓ కట్టెలు కొట్టుకునే వాడికి అడవిలో మిల మిల మెరిసే ఓ రాయి దొరికింది. అతడు దాన్ని ఓ వజ్రాల వ్యాపారస్థుడి దగ్గరకి తీసుకెళ్ళి చూపించి అడిగాడు.

"ఇది నాకు అడవిలో దొరికింది. దీన్ని అమ్మితే నేను జీవితాంతం సుఖంగా జీవించేంత డబ్బు వస్తుందా?"

ఆ వర్తకుడు దాన్ని పరిశీలించి అది ఏ మాత్రం విలువ లేని రాయి అని గ్రహించాడు. అయితే ఆ విషయం తెలిస్తే వాడు బాధ పడతాడని చెప్పాడు.

"మరి కొన్ని పరీక్షలు చేసి కాని నేను ఏం చెప్పలేను. నెల తర్వాత దీన్ని మళ్ళీ తీసుకురా. నా దుకాణానికి నువ్వు రోజూ వచ్చిపోతూంటే రాళ్ళ గురించి ఒకర్ని అడగకుండా నీకే తెలుస్తుంది."

రోజూ తీరిక వేళల్లో ఆ కట్టెలు కొట్టుకునేవాడు ఆ దుకాణానికి వెళ్ళి కూర్చునేవాడు. ఆ వర్తకుడు చెప్పే చిన్న చిన్న పనులని చేసేవాడు. ఏవి విలువైన రాళ్ళో, ఏవి కావో ఎలా తెలుసుకోవాలో అతను కట్టెలు కొట్టేవాడికి నేర్పసాగాడు. ఇలా కొద్ది వారాలు గడిచాక కట్టెలు కొట్టేవాడికి విలువైన వజ్రాల స్వరూపం పూర్తిగా బోధపడింది. ఓ రోజు తనకి దొరికిన రాతిని తీసి పరీక్షించి చూసాడు.

అది విలువ లేనిదని గ్రహించగానే బాధ కలిగింది. వెంటనే ఆ వజ్రాల వ్యాపారి దగ్గరకి వెళ్ళి చెప్పాడు.